క్లుప్తంగా

నేత్ర వైద్యశిబిరం



వృద్ధురాలికి కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ సురేష్

మెరకముడిదాం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) విశాఖపట్నానికి చెందిన నవ జీవన్, స్పందన స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్యశిబిరం నిర్వ హించారు. శిబిరంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆప్తాలమిక్ రుత్తల సురేష్ 116 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 61మందిని కంటి ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. వీరికి త్వరలో ఉచితంగా తమ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించ నున్నామని శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి సీహెచ్.వెంకటరమణ తెలిపారు. పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రామారావు, స్పందన సంస్థ అధ్యక్షుడు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత

చీపురుపల్లి: స్థానిక కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయానికి గరివిడి మండలంలోని అప్పన్నవలసకు చెందిన దిండి చినవెంకటరావు రూ.25 వేల విరాళం ప్రకటించారు. నగదును ఆదివారం ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణుమూర్తి, ఇప్పిలి తిరుమల, గుడ్ల శ్రీను, కడగల సూరికి అందజేశారు. దాతకు ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వేపాడ: కార్తీకమాసం సందర్భంగా వల్లంపూడి గ్రామంలోని షిర్డీసాయి, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల ప్రాంగణంలో గ్రామానికి చెందిన షిర్డీసాయి మహిళా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు అనిల్‌శర్మ బృందం ముందుగా పలువురు దంపతులతో ప్రత్యేక పూజలు చేయించి, అనంతరం శివపార్వతుల కల్యాణం జరిపించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఘనంగా కంచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

గంట్యాడ: సిరిపురంలో గ్రామదేవత కంచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసం దర్భంగా గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామసర్పంచ్ గుండ్రపు సత్యారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు భోజనాలు



పిల్లలకు భోజనాలు వడ్డిస్తున్న గుర్ల గ్రామస్తులు

బొండపల్లి: ఒంపల్లి గ్రామంలోని బ్రైట్ ఫ్యూచర్ డెవలప్‌మెంట్ సొసైటీ అనాథ ఆశ్రమంలోని 150 మంది పిల్లలకు మెంటాడ మండలంలోని గుర్ల గ్రామానికి చెందిన గంట్రేటి రామునాయుడు,సురేష్ ఆదివారం భోజనాలు ఏర్పాటు చేశారు. తమ తండ్రి, మాజీ సర్పంచ్ కారునాయుడు జ్ఞాపకార్థం పిల్లలకు భోజనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.అన్ని శాఖల అధికారులు అందుబాటు లో ఉంటారని, ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేయవచ్చని సూచించారు.

నిర్వీర్యం దిశగా.. సచివాలయ వ్యవస్థ..!

- పలు సచివాలయాల్లో సిబ్బంది కొరత
- బదిలీలు అయిన వారి స్థానంలో తిరిగి నియామకాలు చేపట్టని ఉన్నతాధికారులు
- పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో సేవలందక ఇబ్బందులుపడుతున్న ప్రజలు



మెరకముడిదాం సచివాలయం

మెరకముడిదాం: గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. ప్రభుత్వ సేవల కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యయప్రయాసల కోర్చి మండల, జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన పనిలేకుండా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పాలనను పల్లెకు తీసుకువచ్చారు. ప్రతీ 2వేల జనాభాకు గ్రామాల్లో ఒక గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను పట్టణాల్లో వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. వాటిలో ప్రజలకు సేవలందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సుమారు 1.50 లక్షల మంది ఉద్యోగులను నియమించారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల(ఆర్బీకే) ఏర్పాటుతో మహాత్మా గాంధీజి కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని జగన్‌మో హన్‌రెడ్డి సాకారం చేశారు. ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలతో పాటు రైతులకు విత్తనాలు,ఎరువులు గ్రామాల్లోనే అందేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెచ్చిన సచివాలయ, ఆర్బీకే వ్యవస్థలను ప్రస్తుతం రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రజల్లో అనుమానాలు కలుగుతున్నాయి. వలంటీర్లకు సంబంధించి ఎలాంటి వ్యవస్థ లేదని ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన ప్రకటనతో వలంటీర్ వ్యవస్థను పునరుద్ధరించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లిపోయాయి. సచివాలయ వ్యవస్థను కూడా క్రమంగా నిర్వీర్యం చేస్తారేమోనని సందేహాలు నెలకొన్నాయి. ఉన్నతాధికారుల వ్యవహార శైలి అందుకు బలం చేకూరుస్తోంది. ప్రభుత్వం ఇటీవల సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులను బదిలీలు చేసింది. కొన్ని సచివాలయాల నుంచి బదిలీ అయ్యి వెళ్లిపోయిన సిబ్బంది స్థానంలో తిరిగి సిబ్బందిని నియమించలేదు. దీంతో సేవలందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం మెరకముడిదాం సచివాలయం నుంచి డిజిటల్ అసిస్టెం ట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్ బదిలీపై వెళ్లిపోయారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్‌ను డెప్యూటేషన్‌పై కూనాయవలస వెళ్లిపోయారు. అలాగే ఇక్కడ పనిచేసే ఎనర్జీ అసిస్టెంట్ తన ఉద్యోగానికి రిజైన్ చేసి వెళ్లిపోయాడు. ఇక అప్పటి నుంచి ఆ పోస్టు కూడా ఖాళీగానే ఉంది.బదిలీ అయిన వారి స్థానాల్లో తిరిగి సిబ్బందిని ఉన్నతాధికారులు నియమించలేదు. సోమలింగాపుం సచివాలయం నుంచి వెల్ఫేర్ అసిస్టెంట్ బదిలీపై వెళ్లడంతో ఆ స్థానం కూడా ఖాళీగానే ఉంది. ఉత్తరావల్లి సచివాలయం నుంచి డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, వీఏఏకు బదిలీ అయ్యింది. వీరి స్థానంలో ఇంకా నియామకాలు చేపట్టలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా సచివాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మండల కేంద్రమైన మెరకరముడిదాం సచివాలయంలోనే సిబ్బంది కొరత వేధిస్తుంటే మిగిలిన సచివాలయాల్లో పరిస్థితి ఇంకెలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడు గురునాయుడును సత్కరిస్తున్న తూర్పుకాపు సంక్షేమ సంఘం నాయకులు

బొండపల్లి: మండల కేంద్రానికి చెందిన గెద్ద గురునాయుడు గడసాం హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈయన ఇటీ వల గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పీఈటీలకు నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండల కేంద్రానికి సమీపంలోని ఓ మామిడితోటలో బొండపల్లి పంచాయతీ తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తీక వనసమారాధనలో సంఘం పెద్దలు ఆయన్ని ఘనంగా సన్మానించారు. అంతకుముందు వనసమారాధన సందర్భంగా పిల్లలు, మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పిల్లలు, పెద్దలు వన భోజనాలు చేసి రోజంతా సందడిగా గడిపారు.

యూటీఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



యూటీఎఫ్ నూతన కార్యవర్గం

చీపురుపల్లి: పట్టణంలోని ఓ పాఠశాలలో యూటీఫ్ మండల నూతన కార్యవ ర్గాన్ని ఆసంఘ సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా నడిపేన బలరాం, సహాధ్యక్షులుగా చింతా రామకృష్ణ, జి.పి.ఎస్. లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా దువ్వాడ కృష్ణమూర్తి, కోశాధికారిగా మజ్జి వెంకటరమణ, గౌరవ అధ్యక్షుడిగా మామిడి శ్రీనివాసరావు, గౌరవ సలహాదారు గా ముంతా బోడయ్య ఎన్నికయ్యారు. అలాగే జిల్లా కౌన్సిలర్లుగా గొర్లె పద్మావతి, మిరియాల కృష్ణారావు, సీహెచ్.ఈశ్వరరావు, ప్రమీలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కౌన్సిలర్ మీసాల అప్పలనాయుడు అభినందించారు. ఎన్నికల పరిశీలకులగా సూరు శ్రీనివాసరావు, ఏ.సత్య శ్రీనివాస్ వ్యవహరించారు.

సందడే.. సందడి



వేపాడ: కాశీపట్నంలో దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సందడి

వేపాడ: కార్తీకమాసం..ఆదివారం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో వనభోజనాల సందడి కనిపించింది. మండలంలో కొండగుళ్లు బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయం వద్ద తోటల్లో వేపాడకు చెందిన ఆర్యవైశ్యులు, వాసవీ క్లబ్ సభ్యులు, వేపాడలో పప్పుడుగారి కల్లాల వద్ద వారి కుటుంబ సభ్యులు పికినిక్ ఏర్పాటు చేసుకున్నా రు. ముందుగా ఉసిరి చెట్టువద్ద పూజలు చేశారు. పిల్లలు, పెద్దలు, మహిళలు ఆట,పాటలు, నృత్యాలతో సందడి చేశారు. అంతా కలిసి వన భోజనాలు చేశారు. అలాగే దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శంకరరావు, ఉపాధ్యాయులు ఆ పాఠశాల విద్యార్థులను కాశీపట్నం, తాటిపూడి రిజర్వాయర్‌కు విహారానికి తీసుకువెళ్లారు. కాశీపట్నంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు చేశారు.

గరివిడిలో..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం పక్కన ఉన్న మామిడితోటలో మండల దేవాంగుల, శిష్టకరణాల సంఘాల కార్తీక వనసమారాధన ఆదివారం వేర్వేరుగా జరిగింది. చిన్నారులు, మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వన భోజనాలు చేశారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీల నాయకులు పాల్గొన్నారు.



వేపాడ: కొండగుళ్లులో ఆర్యవైశ్య సంఘం నాయకులను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు



వేపాడ: వేపాడలో ఉసిరి చెట్టువద్ద పూజలు



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో దేవాంగుల వనసమారాధనలో డాన్స్ చేస్తున్న మహిళలు



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలోశిష్టకరణాల వనసమారాధనలో డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

విద్యార్థులకు క్రీడా పోటీలు



మ్యూజికల్ చైర్ ఆట ఆడుతున్న విద్యార్థులు

గజపతినగరం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద విద్యార్థులకు ఆదివారం ఖోఖో,మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపురోజున బహుమతులు అందజేయనున్నట్లు లైబ్రేరియన్ వై.స్వప్న తెలిపారు.

నత్తనడకన పంటకోత ప్రయోగాలు



రెల్లిగౌరమ్మపేటలో పంటకోత ప్రయోగం చేస్తున్న సిబ్బంది

లక్కవరపుకోట: మండంలో ఖరీఫ్ వరి పంటకోత ప్రయోగాలు నత్తనడకన సాగుతున్నాయి. గతంలో పంటకోత ప్రయోగాలు అక్టోబర్ నెలలోనే ప్రారంభించి పంట దిగుబడులను అంచనా వేసేవారు. అయితే ఈ ఏడాది నవంబర్ నెల సగం పూర్తయినా పంట కోత ప్రయోగాల లక్ష్యాలను సిబ్బంది చేరుకోలేకపోయారు. మండలంలోని 84 పంట కోత ప్రయోగాలు చేయాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ప్రస్తుతానికి 16 ప్రయోగాలు మాత్రమే చేపట్టారు.అయితే ఇప్పటి వరకు మండలంలో చేపట్టిన ప్రయోగాల్లో దిగుబడులు ఆశించన స్థాయిలో రాలేదని మండల సహాయ గణాంక అధికారి ఎం.కృష్ణ తెలిపారు.

ముమ్మరంగా వరి కోతలు



గుర్లలో యంత్రం వరి కోతలు చేస్తున్న రైతు

గుర్ల: మండలంలోని వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీల కొరత కారణంగా కొంతమంది రైతులు యంత్రాలతో కోతలు చేస్తున్నారు. యంత్రాల వల్ల తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో కోతలు చేయగలుగుతున్నామని, కూలీల ఖర్చు కూడా తగ్గుతుందని రైతులు చెబుతున్నారు.

బూత్ కమిటీల నియామక సమావేశం



సమావేశమైన బీజేపీ నాయకులు

వేపాడ: మండలంలో బీజేపీ బూత్ కమిటీల నియామకానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు లట్టాల పవన్‌కుమార్ అధ్యక్షతన వల్లంపూడి గ్రామంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి శ్రీరంగ దినేష్ మాట్లాడుతూ మండలంలోని 59 పోలింగ్ బూత్‌లకు కమిటీలను నియమించాలని నాయకులకు సూచించారు. మండలంలోని 9 శక్తి కేంద్రాల్లో శక్తి కేంద్ర రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తయ్యిందని చెప్పారు. విశాఖపట్నం జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు గోకేడ మహేష్,తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించొద్దు

- అధికారుల తీరుపై ఎంపీపీ, జెడ్పీటీసీ అసహనం



మాట్లాడుతున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు

దత్తిరాజేరు: ప్రభుత్వాలు మారడం సర్వసాధారణమని, అధికారులు ప్రజలకు సేవలందించాలే తప్ప అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించడం సరికాదని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి అన్నారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. పలు శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను సభకు చదివి వినిపించారు.ఎంపీపీ మాట్లాడుతూ సాగునీటి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఓటర్ల జాబితాలను గ్రామ సర్పంచ్‌లకు ఎందుకు ఇవ్వలేదని అధికారులను నిలదీశారు. వన్‌బీలు రాని రైతుల పేర్లను కూడా ఓటర్ల జాబితాలో రెవెన్యూ సిబ్బంది చేర్చుతున్నారని, దాని నిలదీస్తామనే రెవెన్యూ సిబ్బంది సమావేశానికి హాజరు కాలేదని పలు గ్రామాల సర్పంచ్‌లు ఆరోపించారు.గడసాం రైతు సేవా కేంద్రం తాళాలు టీడీపీ కార్యకర్తకు ఇవ్వడంతో ఆయనే ఎరువుల పంపిణీ చేశారని గడసాం , చినకాద, ఎం.లింగాలవలస సర్పంచ్‌లు సభ దృష్టికి తెచ్చారు. దీనికి ఏఓ అనురాధ స్పందిస్తూ ఇక నుంచి తప్పులు జరగకుండా చూస్తామని చెప్పారు. మండలంలో 18 గ్రామాలకు రక్షిత మంచినీటి పథకాల ద్వారా తాగునీటి సరఫరాలో సమస్యలు ఎదురవుతున్నాయని, త్వరలో పైపు లైన్లు, ఇతర మరమ్మతులు చేపడతామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చెప్పారు. వరికోతలు ప్రారంభమయ్యా యని, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి త్వరలో ప్రారంభించేలా చూడాలని అన్ని గ్రామాల సర్పంచ్‌లు కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలకు మంజూరైన అభివృద్ధి పనులను సర్పంచ్‌లకు అప్పగించాలని ఉపాధి హామీ ఏపీఓ అప్పలనాయుడుకు సర్పంచ్‌లు సూచించారు. గ్రామసభల్లో తీర్మానం చేసిన పనులను మంజూరు చేయాలని, తీర్మానం చేసిన పనులు కాకుండా అధికార పార్టీ నాయకులు చెప్పిన పనులు మంజూరు చేసి, వారికే ఆ పనులు అప్పగించి తమ హక్కులను కాలరాయవద్దని సర్పంచ్‌లు అన్నారు. మండలానికి పీఆర్ జేఈ లేక పోవడంతో బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయని జేఈని నియమించాలని సర్పంచ్‌లు డీఈ ప్రసాద్‌ను కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి జేఈని నియమించాలని కోరుతానని చెప్పారు.ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులకు సమాచారం ఇస్తూ ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీలు మంత్రి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న ఎంపీపీ జ్ఞానదీపిక

గజపతినగరం: మండల, గ్రామస్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కా రంపై దృష్టిసారించాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలను సభకు చదివి వినిపించగా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, ప్రతీ రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని చెప్పారు. రైతులకు గోనె సంచుల కొరత రాకుండా చూసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ బి.కల్యాణి, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, వైస్ ఎంపీపీలు గెద్ద దమయంతి, కర్రి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటంతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు రాముల యాదవ్

బొండపల్లి: యాదవులంతా ఐక్యంగా ఉంటూ పోరాడడం వల్లే హక్కులను సాధించుకోగలమని, సమస్యలను పరిష్కరించు కోగలమని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకుల రాముల యాదవ్ అన్నారు. గజపతినగరం నియోజకవర్గ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికై న పీతల అప్పలనాయుడు ప్రమాణస్వీకార కార్య క్రమం మండలంలోని గొల్లలపేటలో ఆదివారం నిర్వహించారు. అతిథిగా హాజరైన రాముల యాదవ్ అప్పలనాయుడుతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యాదవులు బీసీ కులంలో ఉన్నప్పటికీ రాజకీయంగా ఎటువంటి అవకాశాలు దక్కడం లేదని అన్నారు. యాదవులకు అన్ని రాజకీయ పార్టీలు ఇతర కులాలతో సమానంగా అవకాశాలు కల్పించాలని కోరారు. యాదవులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి మండే సుభాష్‌చంద్ర యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు ఇసరపు శేఖర్‌యాదవ్, సమితి జాతీయ నాయకుడు కోరుకొండ వీరేంద్ర యాదవ్, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జె.శ్రీనివాస్‌యాదవ్, విజయనగర పట్టణ అధ్యక్షుడు పడగల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బహుళ పంటల సాగుతో అధిక ఆదాయం



బహుళ పంటల సాగు విధానంలో విత్తనాలు వేసే విధానాన్ని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ రీజినల్ అధికారి హేమసుందర్

బొండపల్లి: ఖరీఫ్ వరి కోతలు అనంతరం అదే భూమిలో రబీ సీజన్‌కు సంబంధించి బహుళ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ రీజినల్ అధికారి జి.హేమసుందర్ అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ కాసులమ్మ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం అపరాలతో పాటు 12 రకాల పంటలకు సంబంధించిన విత్తనాలను చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈవిధంగా ఒకే వ్యవసాయ క్షేత్రంలో వివిధ రకాల పంటలను సాగు చేయడం ద్వారా పంటలను చీడపీడ లు ఆశించవని, ఒక పంట సరిగా పండకపోయినా, వేరే పంట అయినా పండే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రకృతివ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్



జేసీబీతో పిచ్చిమొక్కల తొలగింపు పనులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని గదబవలస పంచాయతీ పరిధిలో గదబవలస,ఐతంవలస,చిన ఐతంవలస గ్రామాల శ్మశాన వాటికల రోడ్డులకు ఇరువైపులా ఉన్న తుప్పల తొలగింపు పనులను సర్పంచ్ యల్లంటి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎల్లంటి సత్యనారాయణ ఆదివారం చేయించారు. జేసీబీ సహాయంతో తుప్పలు, పిచ్చి మొక్కలను తొలగించారు.

అయ్యకోనేరును పరిరక్షించుకోవాలి..

విజయనగరం: చారిత్రక ప్రాశస్త్యం కలిగిన అయ్యకోనేరును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, కోనేరును అందంగా తీర్చిదిద్ది, ప్రజావసరాల కోసమే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయితే ఈ కోనేరులో కొంతమంది పూజాసామాగ్రిని, ఇతర నిరుపయోగ వస్తువులను పడేస్తున్నారని, దీంతో కోనేరు పాడవుతోందన్నారు. కోనేరులో, పరిసర ప్రాంతాల్లో చెత్త వేసే వారిపై నిఘా పెట్టామన్నారు. ఎవరైనా చెత్త వేస్తూ పట్టుబడితే అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.